# అంతరార్థం



**కొండముది శ్రీరామచంద్రమూర్తి కథ రాశారంటే దానికి ఏ సంగీత విద్యో, నాట్య శాస్త్రమో, మనస్తత్వ శాస్త్రమో ఆలంబనగా ఉంటుంది. నాటికలు, నాటకాలు, నవలలు, వ్యాసాలు కూడా రచించారు.**

ఉదయరేఖలు ఇంకా పూర్తిగా విచ్చుకోనే లేదు. పైనుంచి వేలాడుతున్న పొగమబ్బు పరదాలు· వక్కకు తప్పుకోనేలేదు.

చక్రవర్తి మెల్లగా గేటు తీసుకుని లోపలకు వచ్చాడు. కోల మొహం. గుబురు గడ్డం. ఆకుచెప్పులు, పైజమా, లాల్చీ వేసుకున్నాడు. లోపలకు వస్తూనే "నమస్కారం మాస్టారూ!" అన్నాడు వినయంగా, వరండాలో వాలుకుర్చీలో పడుకుని కాగల కార్యం ఏ గంధర్వుడు తీరుస్తాడా అని తనలో తనే మల్లగుల్లాలు పడుతున్న వెంకటప్పయ్యతో.

వెంకటప్పయ్య యాభయ్యో పడిలో పడి అయిదా రేళ్ళకు పైగానే అయింది. తలమీద జుట్టు కొంత తెల్లబడింది, కొంత రాలిపోయింది. నొసటి మీదికి ముడుతలు, కంటిమీదకు జోడు వచ్చాయి. పాతికేళ్లకు పైగా క్లాసుల్లో అరిచి అరిచి గొంతు జీరపోయింది.

చక్రవర్తిని చూడగానే అతని మొహం మీది ముడుతలు మరింత దగ్గరకు ముడివడ్డాయి. 'వేళా పాళా లేదు దరిద్రుడికి' అనుకున్నాడు లోలోపల. పైకి మాత్రం పెదిమల మీదికి నవ్వునంటించుకుని "రావోయ్, రా!" అంటూ బలహీనంగా అని, కూర్చోమని ఓ కుర్చీ చూపించాడు. చక్రవర్తి కూచున్న తర్వాత "ఏవిటిలా పొద్దున్నే వచ్చావ్?" అని అడిగాడు నూటిగా, 'ఘనమధ్య మర్యాదలూ, లాంఛనాలూ ఎందుకు?' అన్న ధోరణిలో.

వెంకటప్పయ్య చక్రవర్తి ఒకే కాలేజీలో పనిచేస్తున్నారు. ఒకే డిపార్ట్‌మెంట్‌లో కొలీగ్స్‌గా ఉంటున్నారు. ఒకరి అనుభవం అంత మరొకరి వయసు. చక్రవర్తి చొరవగా అడిగాడు- "అప్పుడే కాఫీల కార్యక్రమం అయిపోయిందేమిటి?" వెంకటప్పయ్య సమాధానం చెప్పేలోగానే లోపల్నుంచి వినిపించింది, "ఇంకా పాలు రాలేదు తమ్ముడుగారూ!"

"పోన్లెండి అక్కయ్యగారూ!" అని నవ్వుతూ వెంకటప్పయ్య వేపు తిరిగి చక్రవర్తి జవాబిచ్చాడు, "ఎందుకింత పొద్దున్నే వచ్చానని కదూ మీరడిగింది? ఏం చేస్తాం?... అవసరం!"

"ఎంతవసరం ఉన్నా ఈ సారికి మటుకు నేను హెల్ప్‌లెస్ చక్రవర్తీ. నువ్వు మరోలా అనుకోవద్దు. నా సంగతి నీకు తెలుసు కదా. నువ్వడగంగానే ఎన్నిసార్లు సిన్నాదుకోలేదు? కానీ, ఇప్పుడు మా పెద్దమ్మాయి పెళ్లి ఒకటి నెత్తిమీదకు వచ్చి కూర్చున్నది కదా! ముహూర్తానికి వారం రోజులు ముందుగానే కట్నం సొమ్ములు తన చేతుల్లో పోసితీరాలని వియ్యంకుడుగారు కబురు పంపారు" అంటూ వెంకటప్పయ్య తన స్థితి వివరించాడు. "ఎంతేవిటి కట్నం?" చక్రవర్తి సానుభూతిగా అడిగాడు. "ఎంతైతే ఏంలే? కట్నం కట్నమేగా?"

"అ! ఏం లేదు. నిన్న సాయంకాలం మీరు పరబ్రహ్మ శాస్త్రిగారి దగ్గరకు వెళ్లారుట కదా, ఓ అయిదు వేలు తక్కువైందీ, వీలయితే సర్దమనీ." పరబ్రహ్మ శాస్త్రిగారి దగ్గరకు తను వెళ్లడం తనకూ, ఆయనకూ మాత్రమే తెలిసిన విషయం. అది చక్రవర్తి దాకా ఎట్లా వచ్చిందా అని వెంకటప్పయ్య ఆశ్చర్యపడ్డాడు. తను పరబ్రహ్మశాస్త్రిగారి దగ్గరికే కాదు, ఇంకా మరికొంతమంది దగ్గరక్కూడా వెళ్లాడు. అదంతా బట్టబయలు కాలేదు కదా అని భయపడ్డాడు. ఆడపిల్ల పెళ్ళి కాదు కానీ, తనెంతో చిన్నతనం అనుభవించవలసి వస్తున్నది. తన చిన్నతనం చక్రవర్తిదాకా కూడా పాకింది కదా అని బాధపడుతూ, "అ... అ! వెళ్లాను, వె...ళ్లా...ను!" అంటూ వెంకటప్పయ్య నీళ్లు నమిలాడు.


"శాస్త్రిగారు మీకేం సాయం చేయగలరూ- ఆయనకే నేను సాయపడితేనూ?" నమ్మశక్యం కానిదేదో చెవుల పడినట్లుగా వెంకటప్పయ్య చివాలున తలెత్తాడు. ఆయన కళ్లు పెద్దవయ్యాయి. కళ్లజోడు ముక్కు మీదకు జారింది. "నువ్వు... నువ్వాయనకు సాయపడ్డావా?" చక్రవర్తి హాయిగా నవ్వాడు. "ఆహా! మీక్కూడా సాయపడదామనే ఇప్పుడిక్కడకు వచ్చాను." జోక్ ఆఫ్ ది ఇయర్ విన్నట్టుగా, వెంకటప్పయ్య పెడీ పెడీ నవ్వాడు. "రియల్లీ!"

"అవును. ఇదిగో, అయిదువేలకు చెక్కు - పదింటికల్లా ఆంధ్రా బ్యాంకుకు వెళ్లి మార్చుకోండి. ఇందుకు మీరు నాకేం వడ్డీ గట్రా ఇవ్వనక్కర్లేదు. అసలిచ్చేయండి చాలు. అది కూడా ఒక్కసారే ఇవ్వనక్కర్లేదు. ఇన్‌స్టాల్‌మెంట్స్‌లో ప్రతీ నెలా ఇంత అని ఇవ్వండి చాలు. అన్నట్లు మనకందరికీ బ్యాంకి ద్వారానే కదా జీతాలిచ్చేది. బ్యాంక్ వారికి ఆథరైజేషన్ ఇవ్వండి. వాళ్ళే నెలకో నాలుగు వందల చొప్పున మీ జీతంలో డిడక్ట్ చేసి, అది నా ఎకౌంటుకు జమ చేస్తారు. పన్నెండు నెలలూ అయింతర్వాత ఇంకా రెండు వందలు బాకీ ఉంటుంది కదా ఆ రెండు వందలూ మీ అమ్మాయికి నేనిచ్చే మేరేజ్ గిఫ్ట్ అంటూ అప్పటికే రాసి ఉంచిన చెక్కును ఆయన చేతుల్లో ఉంచి, "వస్తానండీ!" అంటూ చక్రవర్తి లేచి నిలబడ్డాడు.

అతని పెదిమల మీద వల్చని వెన్నెల వంటి చిరునవ్వు. కొద్దిగా వణకుతున్న చేతులతో వెంకటప్పయ్య ఆ చెక్కును అందుకున్నాడు; "థ్యాంక్యూ, థ్యాంక్యూ వెరీ మచ్ మిస్టర్ చక్రవర్తీ" అన్నాడు బరువుగా ఉన్న గొంతుకతో.

"కాఫీ తాగి వెళ్దురుగాని, ఉండండి తమ్ముడు గారూ." లోపల్నుంచి ఓ అభ్యర్థన వినవచ్చింది. "ఈసారికి క్షమించండక్కయ్య గారూ - మళ్ళీ వచ్చినప్పుడు..." అంటూ చక్రవర్తి హుందాగా నడుస్తూ, మెల్లిగా గేటు తీసుకొని బయటకు వెళ్ళిపోయాడు. అతను బయటకు వెళ్లిపోయిన

చిత్రాలు: పి.ఎస్. బాబు



**అతని పెదిమల మీద వల్చని వెన్నెల వంటి చిరునవ్వు. కొద్దిగా వణకుతున్న చేతులతో వెంకటప్పయ్య ఆ చెక్కునందుకున్నాడు.**

తర్వాత లోపల్నుండి మంగళగౌరి గబగబా బయటికి వచ్చి, భర్త చేతుల్లోంచి ఆ చెక్కును గబాలున లాక్కుని, దాన్ని అటూ ఇటూ పరీక్షగా చూస్తూ, "నిజంగా ఇది చెల్లే చెక్కేనంటారా?" అన్నది అనుమానంగా, ఆశగా.

అంతా వైష్ణవ మాయలాగా ఉంది. చక్రవర్తేమిటి, నాకు చెక్కివ్వడమేమిటి? అతడు పేరుకు చక్రవర్తి కాని, ముళ్ళపూడి సృష్టించిన అప్పారావు పాత్రకు ఇతగాడే ఒరిజినల్! ఏ నెల్లోనూ అతను పూర్తి జీతం ఇంటికి పట్టుకువెళ్లిన పాపాన పోలేదు కదా? ఎవరి దగ్గర అప్పు తీసుకున్నాడో లిస్టు చెప్పడం కన్నా ఎవరి దగ్గర తీసుకోలేదో ఆ లిస్టు చెప్పడం తేలిక! ఒకసారి తీసుకుంటే, తిరిగి ఆ మొత్తాన్ని ఒకేసారి ఇవ్వడం ఉండదు కదా? అసలు వీలయినన్ని ముక్కలు చేసి, ఒక్కొక్క ముక్కనూ సవాలక్ష సార్లు అడిగించుకుని కానీ తిరిగి ఇవ్వకపోవడం చక్రవర్తి ప్రత్యేకత. అటువంటివాడు, అప్పుల మహారాజా ఏకదమ్మున ఇంటికి వచ్చి అయిదువేల రూపాయల చెక్కు నా మొహాన అయిదు రూపాయల నోటులాగా విసిరికొట్టి, "వడ్డీ గిడ్డీ వద్దులెండి" అంటూ షేక్స్‌పియర్ నాటకం "మర్చంట్ ఆఫ్ వెనీస్"లో ఆంటోనియోలాగా మాట్లాడ్డమా?" అంటూ తలమీద ఉన్న నాలుగు వెంట్రుకలనూ పీక్కున్నాడు. "దీని రహస్యమేమి?" అంటూ నొసలు చిట్లించాడు.

"రహస్యం సంగతి తరువాత. ఆ చెక్కు మారితే, ముందా చెక్కును మార్చుకుని డబ్బు తీసుకువచ్చి కట్నం సొమ్ము వియ్యాలవారికి అనుకున్న టైముకు అందజేస్తే, అదో గౌరవంగా ఉంటుంది" అనేసి మంగళగౌరి చెక్కును లోపలకు తీసుకువెళ్ళింది.

ఇంగ్లీషు హెడ్ వెంకటప్పయ్య ఆ ఉదయం వేసుకున్న ప్రశ్ననే ఆ క్రిందటి రోజు సాయంకాలం తెలుగు పండిట్ పరబ్రహ్మ శాస్త్రిగారు కూడా వేసుకున్నారు - చక్రవర్తి తన దగ్గరకు వచ్చి తనవసరం తెలుసుకుని, తనడక్కుండానే ఓ వెయ్యి రూపాయలకు చెక్కు ఇచ్చినప్పుడు. అంతకు కొద్ది నిమిషాల ముందు చక్రవర్తి శాస్త్రిగారి ఇంటి ముందున్న వరండా మెట్లెక్కుతున్నప్పుడు, శాస్త్రి గారికి ఆయన భార్య శ్యామలాంబ చాంతాడంతున్న ఓ లిస్టు అందిస్తోంది, కూతురికి బంతి పెట్టడానికి.

"లిస్టుతో పాటు నీ చేతులకున్న ఆ గాజులు కూడా ఇట్లా తగలేయ్, ఏ మార్వాడీ దగ్గరో తాకట్టు పెట్టి సరుకు పట్టుకొస్తాను" అంటున్నారు శాస్త్రిగారు విసకటగా.

"అలా విసకటడితే ఎలాగండీ ఆడపిల్లను కన్న తర్వాత ఈలాంటి ఖర్చులన్నింటిక్కూడా మనం తలొంచాలి మరి. పెద్ద కూతురు పెద్దమనిషైతే బంతి పెట్టడానికే మీరింతిదైతే, రేపు దాని పెళ్ళికీ, పురుళ్లు వగైరాలకూ ఏమవుతారో నాకర్థం కావడం లేదు సుమండీ."

"ఏమవడం ఏముందీ? ఆ వెంకటప్పయ్యలాగానే ఎక్కే గుమ్మం, దిగే గుమ్మంగా తిరిగి, 'అయ్యా!, నువ్వయిదువేలిస్తావా, నువ్వు పదివేలిస్తావా?' అంటూ అడుక్కుంటాను. ఆడపిల్లను కన్న తండ్రి అంతకన్నా ఇంకేం చెయ్యగలడీ దేశంలో? "చక్రవర్తి రెండడుగులు ముందుకు వేశాడు. "ఏమైనా చేస్తాడు, చక్కగా చదివిస్తాడు, లక్షణంగా ఉద్యోగం చేయిస్తాడు. ఆ చదువూ, ఉద్యోగమూ చూసి ముందుకొచ్చిన వాడిచేతే ఆ మూడు ముళ్లూ వేయిస్తాడు" అన్నాడు.

చక్రవర్తి చొరవకు శాస్త్రి దంపతులు ముందు కొంత ఖంగుతిన్నా అంతలోనే సర్దుకున్నారు. తమ మాటలు అతను ఎట్లాగూ విన్నాడుకదా అన్న నిర్ధారణకు వచ్చి, ఇహ దాపరికం ఎందుకని, పరబ్రహ్మశాస్త్రి వేదాంత కంఠంతో అన్నాడు: "చదువూ - ఉద్యోగమూను. కూతురికి బంతి పెట్టుకోడానికి ఠికాణా కనబడ్డం లేదిక్కడ - నీకేం ఎన్ని కబుర్లైనా చెబుతావు. బరువూ - బాధ్యతా లేనివాడివి."

చక్రవర్తి కొంటెగా అడిగాడు- "బరువూ - బాధ్యతా అంటే ఏమిటి శాస్త్రి గారూ?"

"బరువంటేనా? వెళ్ళి వెంకటప్పయ్య గార్నడుగు. కట్నానికి అయిదువేలు తక్కువై నానా కంగారూ పడుతున్నాడు. పిచ్చివాడు, ఏ నీబోటి వాణ్ణో అడిగితే దొరికే మార్గమన్నా తెలిసేది." ఆ కంఠంలో వ్యంగ్యం. మళ్ళీ అన్నాడు. "నా దగ్గరకు వచ్చాడు. జోగీ జోగీ రాసుకుంటే రాలేదేముంది. ఒట్టి బూడిద తప్ప".

అంతటి నిరాశలో ఉన్న శాస్త్రి గారికి చక్రవర్తి "ఖర్చుల కుంచండి, వడ్డీ సంగతి ఆలోచించకండి, నెలసరి వాయిదాల్లో ఇచ్చేసెయ్యండి"అంటూ వెయ్యి రూపాయలకు చెక్కు ఇచ్చి, మర్నాడు మార్చుకోమనే సరికి ఆయనక్కూడా ఒక్క క్షణం మతిపోయినట్లయింది.

అప్పుల చక్రవర్తి! దమ్మిడీ ఆదాయం కూడా ఎక్స్‌ట్రాగా లేని చక్రవర్తి! జీతం రాళ్ళతో ఇంటి ఖర్చులు కూడా పూర్తిగా గడుపుకోలేని చక్రవర్తి! ఉన్న తాత తండ్రుల ఇంటికి మునిసిపాలిటీ వారి పన్ను కట్టడానికే-నానా యాతనా పడే చక్రవర్తి! ఉన్నపళాన అతను తనకు వెయ్యి రూపాయలు అప్పు పెట్టే స్తోమతను ఎక్కడి నుంచి సంపాదించుకున్నాడూ? ఆ రహస్యం ఏమిటి?


శ్యామలాంబ హెచ్చరించేవరకూ పరబ్రహ్మ శాస్త్రి గారు ప్రకృతంలోకి రాలేకపోయారు.

పరబ్రహ్మశాస్త్రి గారే కాదు. ఇంకో నలుగురైదుగురు కూడా అదే సందిగ్ధంలో పడ్డారు. వైస్-ప్రిన్సిపాల్ జగ్గయ్య, ఫిజికల్ డైరెక్టర్ యగ్గెన్న, లైబ్రేరియన్ ముక్తేశ్వరం, ఫిజిక్స్ లెక్చరర్ సూర్యారావులు కూడా చక్రవర్తి దగ్గర తమ అవసరాలకు చెక్కులందుకుని, చెక్కులిచ్చేంత డబ్బు చక్రవర్తి దగ్గర ఎట్లా చేరిందో అర్థంకాక తికమక పడిపోయారు. "ముదనష్టం ఏదన్నా చేరిందేమో" అన్నాడు పి.డి. యగ్గెన్న, స్టాఫ్ రూంలో నలుగురూ సమావేశమైనప్పుడు. అతనికి ముదనష్టం కథలంటే చాలా ఇష్టం. అకస్మాత్తుగా ఎవరన్నా ధనవంతుడైపోతే, అతగాడికి ముదనష్టం ఏదన్నా కలిసి తీరాలని అతని గాఢ నమ్మకం.

"మనకు తెలీకుండా చక్రవర్తికి లాటరీ ఏదన్నా తగిలిందేమో!" ముక్తేశ్వరం అన్నాడు సాలోచనగా. కిందటి సారి రెండు కోట్ల సిక్కిం లాటరీ ప్రయిజు ప్రకటన వచ్చినప్పుడు ముక్తేశ్వరమూ, మరికొందరూ కలిసి ఓ సిండికేట్ లాగా ఏర్పడి తలా ఒక వెయ్యి రూపాయల టికెట్లు కొన్నారు. లాటరీ తగలడం అటుంచి, ముక్తేశ్వరానికి స్టాఫ్ కో-ఆపరేటివ్ సొసైటీలో ఓ వెయ్యి రూపాయల అప్పు మాత్రం గట్టిగా తగిలింది. అయినా, ఎవరికన్నా ఉన్నట్లుండి ధనయోగం పడితే, అతగాడికి తప్పక లాటరీయే తగిలితీరాలని ఓ గట్టి నమ్మకం. "ముదనష్టమూ లేదు లాటరీ లేదు, మనకు తెలీకుండా, ఏ కొంపో గోడో ఉంటే, అది కాస్తా అమ్ముకుని ఉంటాడు. ఇప్పుడిట్లా దర్జా వెలగబెడుతున్నాడు" అన్నాడు జగ్గయ్య.

"అబ్బెబ్బె! చక్రవర్తికి మనకు తెలీని ఆస్తిపాస్తులేవీ లేవు ఆ ఉన్న పాతకాలం నాటి ఓ బోడి కొంప తప్ప. అందులోనే ఉంటున్నాడు కాబట్టి అది అమ్మి ఉండడానికి అవకాశం లేదు కదా?" అన్నారు మిగిలినవాళ్ళు.

వి.పి. జగ్గయ్య కనుబొమలు రెండూ దగ్గరకు చేర్చి ఆ మిస్టరీని విడగొట్టడానికి సీరియస్‌గా ఆలోచించడం మొదలెట్టాడు. తాను చెప్పింది తప్ప, మరొకటి జరిగి ఉండడానికి ఆస్కారం లేదన్న ధోరణిలో పి.డి. యగ్గెన్న చుట్ట ముట్టించాడు. తను చెప్పిందానికి మిగిలినవాళ్ళు ఔననలేదన్న కోపంతో ముక్తేశ్వరం ఓ పుస్తకంలో తల దూర్చి నిప్పు కోడిగా మారిపోయాడు. పి.యల్.



"ఎందుకు మీరు పేచెయ్యడం లేదూ" అని ఎక్కడ తమను అడిగి పోతాడో అని వాళ్ళు మొహం చాటెయ్యడం మొదలుపెట్టారు.

సుర్యారావు మాత్రం మిగిలిన వాళ్ళ వేపు ఒకసారి సాభిప్రాయంగా చూసి, సన్నగా అన్నాడు:

'రిజిష్ట్రార్ ఆఫ్ ఎస్యూరెన్స్‌లో ఎంక్వయిరీ చేస్తే ఇటీవల చక్రవర్తేమన్నా అమ్ముకున్నదీ, లేకపోతే కొనుగోలు చేసిందీ తెలిసిపోతుంది కదా? అమ్ముకునే ఉన్నట్లయితే ఆ డబ్బు మనందరికీ ఇట్లా మదుపు పెడుతున్నట్లు - లేదూ - ఎక్స్‌ట్రా ప్రాపర్టీ ఏదన్నా కొనుక్కున్నాడూ అంటే అతనికేదన్నా ముదనష్టమో, లాటరీయో తగిలినట్లు!" గుట్టుచప్పుడు కాకుండా ఆ సమాచారాన్ని సేకరించే భారాన్ని వాళ్ళు ముగ్గురూ మళ్ళీ సూర్యారావు మీదనే పెట్టారు. అతను కూడా అందుకు అనుగుణంగానే రిజిష్ట్రారాఫీసుకు వెళ్ళి ఎంక్వయిరీ చేశాడు, తెలిసిన వాళ్ళ ద్వారా.

చక్రవర్తి పోలికలున్న మనిషెవడూ గత రెండు నెలలుగా తమ కార్యాలయంలో అడుగుపెట్టిన పాపాన పోలేదని ఆ తెలిసిన వాళ్లన్నారు. ఫైళ్లన్నీ ఓపిగ్గా వెతికి చక్రవర్తి పేరు మీదుగా విక్రయాలేవీ లేవన్న సంగతిని నిర్ధారించి మరీ చెప్పారు.

చక్రవర్తి దగ్గర అప్పులు పుచ్చుకున్న వాళ్లకందరికీ ఒంటిమీద తేళ్ళూ - జెర్రులూ పాకినట్లు ఉంది. మనసు మీద మహేంద్ర పర్వతం ఉన్నంత బరువు, ఎదుటివాడి రహస్యం తెలియకపోతే కలిగే ఆందోళన వాళ్లను అతలాకుతలం చేసేస్తున్నది.

ఏమిటీ రహస్యం? రహస్యం భేదనం జరిగేలోపునే వెంకటప్పయ్య కూతురి పెళ్ళి కొట్టి - కోలాహలంగా జరిగిపోయింది. పరబ్రహ్మశాస్త్రిగారి కూతురికి బంతి పెట్టేశారు. జగ్గయ్యగారు తను కొత్తగా ఏర్పాటు చేసుకున్న స్టడీ రూంలో ఎయిర్-కండిషనర్ పెట్టించుకున్నారు. యగ్గేన్న ఆలిండియా ఇన్విటేషన్ టెన్నిస్ టోర్నమెంటుకు విజయనగరం వెళ్ళొచ్చాడు. ముక్తేశ్వరం సెకండ్ హ్యాండ్ చేతక్ నొకదాన్ని కొనుక్కున్నాడు. సూర్యారావు రెండో కాల్ గ్యాస్ స్టవ్వూ, సిలెండరూ సంపాదించుకున్నాడు. ప్రపంచంలో అందరూ తమకు కావలసినవి తాము ఏర్పాటు చేసుకుంటున్నారు. ఎవరికి వారు ఎదుటివాడు బాగుపడేలోపునే తాము బాగుపడిపోవాలనుకుంటున్నారు. చక్రవర్తి సాయం పొందిన వాళ్లు కూడా అందుకు భిన్నంగా ఏమీ లేరు.

అయితే - చక్రవర్తి అడిగిన ఆథరైజేషన్ లెటర్ మాత్రం ఇస్తాం, ఇస్తాం అంటూనే అందరూ వాయిదా వేసేశారు. ఆథరైజేషన్ లెటర్ లేకపోవడంతో, నెలనెలా వాళ్ల జీతాల్లోంచి ఇంత అని విధిగా మినహాయించి, అది చక్రవర్తి ఖాతాకు జమ చేయవలసిన బాధ్యత బ్యాంక్ వాళ్ళకు లేకపోయింది.

"ఎందుకు మీరు పే చెయ్యడం లేదూ?" అని ఎక్కడ చక్రవర్తి తమను అడిగిపోతాడో అని వాళ్ళు మొహం ఛాటెయ్యడం మొదలుపెట్టారు. కానీ, ఎంతగా తప్పించుకు తిరుగుదామన్నా, కొలీగ్స్ కావడంతో, ఎక్కడో అక్కడ కలవకా తప్పడం లేదు; కలిసినప్పుడు, చక్రవర్తిని చూసినప్పుడు ఒక్కొక్కళ్లు ఒక్కొక్క విధంగా గిల్టీగా ఫీల్‌కాకా తప్పడం లేదు.

"అయ్యా! వెంకటప్పయ్య గారూ! మీ దగ్గర, వెధవది వంద రూపాయలు అప్పు తీసుకుంటే వందసార్లడిగి, నిల్చున్నచోట నీళ్లు తాగకుండా చేశారే- మూణ్ణెల్లపాటు మీ డబ్బును తిరిగి ఇవ్వలేకపోయానని, దబాయించి నెలకు మూడు రూపాయల చొప్పున వడ్డీ వసూలు చేశారే- ఇప్పుడు మీరు వడ్డీ కూడా ఇవ్వనక్కరలేదు కదా, నెలా నెలా వాయిదాలు కూడా చెల్లించకుండా నన్నిట్లా ఇబ్బంది పెట్టడం మీకు భావ్యమా?" అని చక్రవర్తి అడుగుతున్నట్లు వెంకటప్పయ్య గారికి అనిపించేది.

కానీ, చక్రవర్తి ఆ విధంగా అడిగేవాడు కాదు. అతని పెదిమల మీద వెన్నెల వంటి నవ్వు, మొహంలో జగద్రహస్య సిద్ధాంతాన్ని దేన్నో తెలుసుకున్నానన్న వేదాంత భావన.

"ఏం మాస్టారూ, కులాసాగా ఉన్నారా?" అని మాత్రం అడిగి వెళ్ళిపోయేవాడు.

ఇదేం మనిషి? తన బాకీ అడగడేం? బాకీ వసూలుకాకపోయినా ఫర్వాలేని ఆర్థిక పరిస్థితా అతనిది? అప్పు పెట్టగల్గడమే ఒక మిస్టరీ అయితే, ఆ అప్పు వసూలు చేసుకునే ప్రయత్నం చెయ్యకపోవడం మరో మిస్టరీ అయింది.

పరబ్రహ్మ శాస్త్రిగారనుకునేవాడు- "చక్రవర్తీ! నీకు అప్పు కావలసిన సమయంలో నీచేత తాకట్టు పెట్టిస్తేనే కానీ అప్పు ఇప్పించలేకపోయాను. ఆ తాకట్టు వాకట్టు అవుతున్నా నీకు సాయపడలేకపోయాను. మళ్లీ ఇప్పుడు మాట తప్పుతున్నాను. ఏం చెయ్యనయ్యా? శ్లేష్మంలో పడ్డ ఈగను. కానీ, నీ విషయమే ఆశ్చర్యంగా ఉంది సుమా లేమి అనే ఈ శ్లేష్మంలో నుంచి ఎట్లా బయటకు దూకేశావ్..ఎట్లా?"

చక్రవర్తి రహస్యాన్ని కనుక తను కనిపెట్టేస్తే, ఆ రహస్యాన్ని తన గుప్పిట్లో ఉంచుకుని చక్రవర్తిని అప్పు తిరిగి అడక్కుండా చేయవచ్చు కదా అనుకుని జగ్గయ్య షరాబు కొట్లలో వాకబు చేయించాడు. ఫెయిలయ్యాడు. దాంతో అతనికీ మిస్టరీ అర్థంకాక, చక్రవర్తి కనిపించగానే "హౌడూయుడూ?" అంటూ కుశల ప్రశ్నలు వేస్తూ, టీ ఇప్పించి మర్యాద చేస్తూ తన పబ్బం గడుపుకుంటున్నాడు.

అయినా, చక్రవర్తిలో అదే చిరునవ్వు. అదే ప్రశాంతత. ఇదివరలో తాను ఇతరుల దగ్గర అప్పు తీసుకున్నప్పుడు, వాళ్ళను ఎంతటి చిరునవ్వుతో అడిగేవాడో ఇప్పుడూ అదే చిరునవ్వు. తాను అప్పు తిరిగి సకాలంలో ఇవ్వలేకపోయినప్పుడు అవతలివాళ్లు మొహం చిట్లించి, అవమానకరంగా మాట్లాడుతున్నప్పుడు ఎంతటి ప్రశాంతతను కనపరిచాడో ఇప్పుడూ అదే ప్రశాంతత.

అతను ప్రశాంతంగా ఉంటున్నకొద్దీ వాళ్ళకు ఆందోళన అధికమైంది. అతను చిరునవ్వుతో వాళ్ళను పలకరించినకొద్దీ వాళ్ళ మొహాలు మాడిపోయేవి. చక్రవర్తి దగ్గర తీసుకున్న బాకీ అతని మొహాన కొట్టేసి ఋణ విముక్తులమైపోదాం అనిపించేది. కానీ, అందుకు వెసులుబాటు మాత్రం కుదిరేది కాదు.

"ఏ పాపిష్ఠి ముహూర్తంలో ఆ చెక్కుల్ని పుచ్చుకున్నామో, ఎంతగా ప్రయత్నం చేసినా అతగాడి బాకీ ఒక్క పైసా కూడా తీర్చలేకపోతున్నాం!" అనుకోవడం మొదలుపెట్టారు. ఆ చక్రవర్తి ఎన్నిసార్లు మనదగ్గర బాకీ పుచ్చుకున్నా ఎప్పుడో అప్పుడు ఇచ్చేసేవాడు. ఋణ విముక్తుడైపోయేవాడు. మనకా అదృష్టం లేకుండా ఉంది" అంటూ బాధపడే వాళ్లు.


వాళ్ళిట్లా బాధపడుతూ ఉండగానే క్వార్టర్లీ సెలవులు వెళ్ళిపోయాయి. యూనివర్సిటీ వారు సెప్టెంబర్ పరీక్షలు పెట్టడం, పేపర్లు దిద్దించడం జరిగిపోయింది. క్రిస్మస్, సంక్రాంతి పండగలు రావడం, కాలేజీలు మూయడం, తెరవడం కూడా అయింది.

వేసవి ఎండలు గడపలదాకా వచ్చేశాయి.


ఉస్సురుస్సురనుకుంటూ ఓ రోజు మధ్యాహ్నం వెంకటప్పయ్య, పరబ్రహ్మ శాస్త్రి, జగ్గయ్య, యగ్గేన్న, ముక్తేశ్వరం, సూర్యారావు ఇంకా మరి కొందరు స్టాఫ్ రూంలో సమావేశమైనారు, ఇంటర్వెల్ సమయంలో. వాళ్ళను చూసి అటెండర్ దానియేలు కంగారుపడుతూ పరుగెత్తుకువచ్చి "ఇన్నారా బాబూ ఇన్నారా, ఈ విషయం?" అన్నాడు వణకుతున్న కంఠంతో.

"ఏవిటీ?" అందరూ ఏకకంఠంతో అడిగారు.

"చక్రవర్తి బాబుకు ఎమరేజ్ వొచ్చిందంట, ఆస్పటాలకు తీసికెల్లేలోపునే..." దానియేలు మాట పూర్తి



పెరిగిన గడ్డంతో చక్రవర్తి ఇహలోక బంధాలను తెంచుకున్నానన్న ధీమాతో ఉన్న మనిషిలా ప్రశాంతంగా పడుకుని కనిపించాడు.



వాళ్ళ మనసులకు ఒకేఒక ప్రశ్న వచ్చి సూటిగా తగులుతున్నది. చక్రవర్తి మరణానికి తామే కారణమా?

"అమ్మా!" శ్రీలక్ష్మి తన తల్లిని ఆటంకపర్చాలని ప్రయత్నించింది. కానీ, ఆమె ఊరుకోలేదు. గబగబా ఇంట్లోకి వెళ్ళి, టేబులు సొరుగులో ఉన్న ఓ కవరును తీసుకుని వచ్చి వాళ్ళ ముందు పడేసింది. "ఇది బాబూ మీ చక్రవర్తి ఘనకార్యం!"

ముక్తేశ్వరం ముందన్నుగా ఆత్రంగా దాన్నందుకున్నాడు.

చేయలేకపోయాడు.

"ఆఁ!" అందరూ నిశ్చేష్టులైపోయారు.

ప్రిన్సిపాల్ చెవిన ఆ మాట వేసి, పర్మిషన్ తీసుకుని చక్రవర్తి ఇంటికి ఉరుకులు పరుగులుగా వెళ్లారు. కండొలెన్స్ మీటింగ్ పెట్టడం, కాలేజీ మూసెయ్యడం వగైరా తతంగం అంతా ఆయనకే వదిలిపెట్టేసి. చక్రవర్తి ఇంటి దగ్గర వరండాలో, చాపమీద, తల దగ్గర దీపం పెట్టుకుని, మంచు గడ్డల మధ్య, పెదిమల మధ్య చెరగని చిరునవ్వుతో, మూసుకుపోయిన కళ్లతో, పెరిగిన గడ్డంతో చక్రవర్తి ఇహలోక బంధాలను తెంచుకున్నానన్న ధీమాతో ఉన్న మనిషిలా ప్రశాంతంగా పడుకుని కనిపించాడు. అతని ప్రక్కన అతని భార్య శ్రీలక్ష్మి కూచుని ఉంది. ఎర్రని కళ్లతో, పీక్కుపోయిన మొహంతో, చెదరిన జుట్టుతో, మాసిన చీరతో, దైన్యానికి రూపంగా, జరిగిన అన్యాయానికి ప్రతిరూపంగా ఆమె కనిపిస్తోంది.

పరబ్రహ్మశాస్త్రి సంప్రదాయమైన ఉపశమన వాక్యాల్ని పలికాడు. ఆయన మాటలకు వెంకటప్పయ్య వంత పలికాడు. స్నేహితుడంటే చక్రవర్తే అన్నారు. మాట తప్పని హరిశ్చంద్రుడన్నారు. చేతికి ఎముకలేని వాడన్నారు. నిత్య భోగి అన్నారు, నిర్వికారుడన్నారు.

శ్రీలక్ష్మి అందర్నీ మాట్లాడనిచ్చింది, అందరి మాటలూ వేదనాభరిత వదనంతో విన్నది ఆ ఇల్లాలు. "అంత గొప్పవాడా నా భర్త!" అన్నట్లుగా విస్ఫారిత నేత్రాలతో వాళ్ళవేపు చూసింది.

శ్రీలక్ష్మి తల్లి కూతుర్ని పొదివి పట్టుకుని కూచుని ఉన్నది. నూతిలో గొంతుకలా ఉన్న స్వరంతో అన్నది. "చుట్టూ ఉన్న వాళ్లు చిన్నబోతూ మెచ్చుకుంటే, ఆ మెప్పుదలలో కట్టుకున్న దాన్ని చిన్నబుచ్చిన వాడు బాబూ మీ స్నేహితుడు చక్రవర్తి."

"ఇప్పుడా సంగతులన్నీ ఎందుకులే అమ్మా?" అంటూ తల్లిని వారించబోయింది శ్రీలక్ష్మి. కానీ, కూతుర్ని లక్ష్యపెట్టలేదు ఆ తల్లి. పూడ్చుకుపోయిన కంఠంతో అన్నది- "ఉండవే, నీకేం తెలుసు? ఇంకా ఎందుకూ దాపరికం? మనిషి బతికున్నంత వరకూ ఇంటి గుట్టు అంటూ చేదువిషాన్నంతా గొంతులోనే దాచుకున్నావ్? ఇప్పుడైనా నలుగుర్నీ అసలు సంగతిని తెలుసుకోనీ." చేరినవాళ్లందరూ శ్రీలక్ష్మి తల్లి మాటల్ని శ్రద్ధగా ఆలకించడం మొదలుపెట్టారు. అవతల చక్రవర్తి శవం. ఇవతల ఓ ఆడకూతురు నిస్సహాయంగా కారుస్తున్న కన్నీరు. మధ్యలో ఓ తల్లి గుండెకోత.

"ఏం బాబూ, మా అల్లుడు మీ అందరి దగ్గరా అప్పులు తీసుకునేవాడట కదా?" అవునన్నట్లుగా మౌనంగా తలాడించారు వాళ్ళు.

"తీసుకున్న అప్పుల్ని అనుకొన్న సమయానికి తిరిగి ఇచ్చేయడానికి ఆయన పాపం ఎంతో ఇదై పోయేవారు!" శ్రీలక్ష్మి మెల్లగా అన్నది. "ప్రాణ స్నేహితులనుకునేవాళ్ళు ముక్కు పిండి వడ్డీ వసూలు చేసేవాళ్ళని ఎంతో బాధపడేవారు. అప్పు తీసుకొన్నందుకుగాను తననో గడ్డిపరక కింద తీసి పారేస్తూ మాట్లాడేవారని, అవమానిస్తున్నారని ఎన్నోసార్లు ఆయన కన్నీళ్లు పెట్టుకున్నారు. అయినా, అప్పు తీసుకోడం తప్పేదీ కాదు, తీసుకున్న తర్వాత తనలో తను కుమిలిపోవడమూ తప్పేదీకాదు."

"ఆ లోపల లోపల కుమిలిపోవడమే ఇలా కొంప మీదకు తెచ్చిందే తల్లీ" అంటూ శ్రీలక్ష్మి తల్లి ఉన్నట్టుండి పెద్ద పెట్టున రోదించింది. శ్రీలక్ష్మి తల్లికి కొంచెం దూరంలో ఉన్నాడు తండ్రి - భార్య మాటలు విని చివాలున తలపైకెత్తాడాయన. ఆయన కళ్లు కోపంతో, దుఃఖంతో రవ్వంత ఎరుపెక్కాయి. "అల్లుణ్ణి గురించి అంత తక్కువగా అంచనా వేసుకుంటావేం?" అన్నాడు.

శ్రీలక్ష్మి తల్లికి భర్త మాటలతో రోషం వచ్చింది. "కుమిలిపోయేగా ఆ పాడు పని చేసిందీ?" అన్నది కఠినంగా. "అదేం పాడు పని కాదు. తనను అవమానించిన వాళ్ళకు ఉపకారం చేసి, బుద్ధొచ్చేట్లు చేశాడు. తన ముందు వాళ్లు తలెత్తుకోలేనట్లు చేశాడు. తననో గడ్డిపరక కింద తీసి పారేసిన వాళ్ళకు, తనెంత పెద్దమనసుకలవాడో రుజువుపర్చాడు. తన ముందు వాళ్ళందరూ చిన్నబోయేట్లు చేశాడు. ఇదంతా నాతో చెప్పుకుని మన చక్రవర్తి ఎంత రిలీఫ్ ఫీలయ్యాడో నీకేం తెలుసే పిచ్చిదానా?

ఆ నడివయసు ఇల్లాలికి భర్త మాటలు మరింత కోపాన్ని తెప్పించాయి. చుట్టూ ఉన్న వారివేపు ఆమె కన్నీటి మబ్బుల గుండా చూసింది. "లేని గొప్పలకు పోయి, అప్పులిచ్చి, అందర్నీ చిన్నబుచ్చి ఆనందించిన అల్లుడు, మీ అల్లుడు మన అమ్మాయిని కూడా నట్టేట్లో ముంచిన సంగతిని మర్చిపోకండి? అన్నది పరుషంగా.

ఎవరో బొంబాయి ఫైనాన్స్ కార్పొరేషన్ వాళ్ళిచ్చిన నోటీస్. ఇంగ్లీషులో ఉంది. "అయ్యా చక్రవర్తి గారూ! మీరు సంవత్సరం క్రితం మీ ఇంటి తాలూకు ఒరిజినల్ డాక్యుమెంట్లు, ఇ.సీ., ప్లానూ, వేల్యుయేషన్ ఎస్టిమేట్లూ మాకు పంపి, ప్రామిసరీ నోటు మీద డబ్బు తీసుకున్నారు. అప్పు మొత్తం ఒక్క సంవత్సరంలో తీర్చగలనన్నారు. తీర్చలేకపోతే, ప్రామిసరీ నోటుతో జత చేసి పంపించిన ఇంటి విక్రయదారు పత్రాన్ని అమలు చేయవచ్చునన్నారు. మీకూ మాకూ మధ్య గల ఒప్పందం ప్రకారమే మా విజయవాడ బ్రాంచి నుంచి ఒక మనిషి వారం రోజులలో అక్కడకు వచ్చి, మీ ఇంటిని స్వాధీనం చేసుకోగలడు. ఏ విధమైన కష్ట నష్టములు కలుగజేయకుండా సదరు మీ తాలూకు ఆస్తిని మా మనిషికి స్వాధీనం చేయవలసినది" అన్నది దాని సారాంశం.

శ్రీలక్ష్మి తల్లే అంటున్నది- "ఇచ్చిన అప్పులే వసూలు చేసుకునే తెలివితేటలు లేకపోయాయి. తను అప్పు తీసుకుంటున్నప్పుడు ఎంతగా బాధపడ్డాడో, తన దగ్గర అప్పులు తీసుకుని ఇతరులు అంత బాధపడితే చూసి సంతోషిద్దామనుకున్నాడు. 'వద్దండీ ఇటువంటి పన్లు' అని అమ్మాయి చెప్పబోతే దానిమీద కస్సుమన్నాడు. ఎవరెవరికి ఎంతెంతిచ్చింది కూడా దానికి చెప్పలేదండీ! ఇప్పుడేం చెయ్యడం? మనిషి పోయాడు, డబ్బు పోయింది, ఉన్న ఇల్లు పోతోంది." ఆమె నోటికి చెంగు అడ్డం పెట్టుకుని ఏడుస్తోంది.

"పర్వానేదునెండమ్మా - అందరికీ సెక్కులే ఇచ్చినట్లు సెప్పాడా బాబు" అన్నాడు దానియేలు.

"ఆ చెక్కుబుక్కు కనబడడం లేదు దానియేలూ" శ్రీలక్ష్మి దీనంగా అన్నది. వెంకటప్పయ్య, పరబ్రహ్మశాస్త్రి, జగ్గయ్య, యగ్గెన్న, ముక్తేశ్వరం, సూర్యారావు ఒక్కసారి చక్రవర్తి వేపు చూశారు. ఆ పెదిమల మీద ఇప్పుడు చిరునవ్వు కనబడటం లేదు. "బుక్కు లేకపోతే ఏం? మీ మనసులకు తెలుసుగా?" అన్న ప్రశ్నను అడుగుతున్నట్లు ఉన్నాయా పెదిమలు. ఆ ప్రశ్నకు తట్టుకోలేనట్లు వాళ్ళందరూ కలిసి కట్టుగా లేచి నిలబడ్డారు. చక్రవర్తి తమకందరికీ అప్పులెట్లా ఇచ్చాడో ఆ మిస్టరీ విడిపోయింది. కానీ, ఇప్పుడు నిజం తెలుసుకున్న తర్వాత వాళ్ళ గుండెలు మరింత బరువెక్కుతున్నాయి. వాళ్ళ అడుగులు బరువుగా పడుతున్నాయి.

వాళ్ల మనసులకు ఒకేవొక ప్రశ్న వచ్చి సూటిగా తగులుతున్నది. చక్రవర్తి మరణానికి తామే కారణమా?



1917